RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

C I T I Z E N   T I M E S   T E L U G U   D A I L Y

VOLUME: 17 | ISSUE: 264 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 19-4-2026 | Pages: 8 | R2/-

సంపుటి : 17 | సంచిక : 264 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 19-4-2026 | పేజీలు : 8 | రూ2/-





## మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహమే

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాలపై నిడదవోలులో ఎన్డీఏ నిరసన

బిల్లును అడ్డుకుని విపక్షాలు జాతికి ద్రోహం చేశాయని మండిపడ్డ చంద్రబాబు

పార్లమెంట్‌లో జరిగిన పరిణామం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక బ్లాక్ డే అని వ్యాఖ్య

విపక్షాల ద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని, ఇది ఆరంభం మాత్రమేనని హెచ్చరిక

కుట్ర చేసిన పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేయాలని ప్రజలకు పిలుపు

**నిడదవోలు, సిటిజన్ టైమ్స్**

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు జాతికి ద్రోహం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఒక బ్లాక్ డే అని ఆయన అభివర్ణించారు. మహిళా బిల్లును అడ్డుకున్న విపక్షాల వైఖరికి నిరసనగా తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు శనివారం భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. ఈ ర్యాలీ అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడి, విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సుదీర్ఘ కల సాకారం అవుతుందని దేశమంతా ఆశగా ఎదురుచూసింది. కానీ, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్షాలు తమ సంకుచిత రాజకీయ అజెండా కోసం ఈ చారిత్రక బిల్లును అడ్డుకుని దుర్మార్గానికి పాల్పడ్డాయి. ఎక్కడ స్త్రీలను

తరువాయి 2లో..

## 'వందేళ్లు జీవించు చిట్టితల్లీ'...

రూ.16 కోట్ల ఇంజెక్షన్ తో పునర్జన్మ...

చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడిన మంత్రి నారా లోకేష్

ప్రజల సాయంతో రూ.10 కోట్లు, మిగిలిన మొత్తానికి లోకేష్ హామీ

ఇంజెక్షన్‌ను విదేశాల నుంచి తెప్పించిన మంత్రి

లోకేష్ సమక్షంలో చిన్నారికి జీన్ థెరపీ ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు

ప్రాణం నిలిపిన లోకేష్‌కు, దాతలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

లక్షల హృదయాల ప్రార్థనలు ఓవైపు, మంత్రి నారా లోకేశ్ కృషి మరోవైపు... అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక ప్రాణాన్ని నిలబెట్టాయి. కొన్ని నెలలుగా 'సేవ్ పునర్విక' అంటూ సామాజిక మాధ్యమాల్లో సాగిన మానవతా ఉద్యమానికి సార్థకత లభించింది. ఆ పసిమొగ్గకు ప్రాణం నిలిచింది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో ప్రాణాలతో పోరాడుతున్న ఏడాది చిన్నారి పునర్వికకు మంత్రి నారా లోకేష్ రూపంలో అందిన ఆపన్నహస్తం,

తరువాయి 2లో..

## దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

**2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ**

**మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్ రెడ్డి**

**డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు

తరువాయి 2లో..



## విపక్షాలు జీవితాంతం చింతిస్తాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ

బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయన్న మోదీ

విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని వ్యాఖ్య

బిల్లుకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా సాకులు వెతుకుతున్నారన్న మోదీ

తరువాయి 2లో..





## రద్దు చేసిన నోట్ల మార్పిడికి ఆర్‌బీఐ కొత్తరూల్స్..?

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రద్దయిన పాత కరెన్సీ నోట్లు మార్చుకోవడానికి అనుమతిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాలు ఇచ్చిందంటూ కొన్ని కథనాలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న వార్తలు తప్పని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి ఆర్‌బీఐ ఎలాంటి నిబంధనలూ జారీ చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పేర్కొంది. కచ్చితమైన, ధ్రువీకరించిన సమాచారం కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించింది. ఏవైనా అనుమానాస్పద మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు ప్రజల దృష్టికి వస్తే పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగానికి పంపాలని విజ్ఞప్తి చేసింది. వాట్సప్ నంబర్ 91 8799711259, లేదా ద్వారా ఈ-మెయిల్ చేయెుచ్చని సూచించింది. 2016 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం అకస్మాత్తుగా రూ.500, 1000 నోట్లను రద్దు చేసింది. దీంతో ఏర్పడిన కరెన్సీ కొరతను తీర్చేందుకు రూ.2000 నోట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ తర్వాత రూ.2000 నోట్లను వినియోగం నుంచి ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

## ఖాళీ ప్లేట్లు.. పలచటి చపాతీలు

## అమెరికా సైనికులకు ఆహార కొరత..?



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్లేట్‌లో ఒక మూలన రెండు పలచటి చపాతీలు.. ఉడికించిన కొన్ని క్యారెట్ ముక్కలు.. ఓ పక్కన కొంచెం మాంసం.. ఈ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమెరికా సైనికులకు ఈ చాలీచాలని ఆహారమే అందుబాటులో ఉందట. కొన్ని వారాలుగా పశ్చిమాసియాలో విధుల్లో ఉన్నవారు ఆహార కొరతను ఎదుర్కొంటున్నారా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి వేలమంది సైనికులను అమెరికా పశ్చిమాసియాకు పంపింది. అలాగే యూఎస్ఎస్ ట్రిపోలి, యూఎస్ఎస్ అబ్రహాం లింకన్.. హర్మూజ్ దిగ్బంధనంలో

తరువాయి 2లో..

## రాజమండ్రి-విశాఖ మధ్య 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం..

# కేంద్రం ఆమోదం

ఏపీలో కీలక రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

రూ.9,889 కోట్లతో రాజమండ్రి-దువ్వాడ రైల్వే లైన్ల విస్తరణ

తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు ప్రయోజనం

ఏపీ, యూపీలలో మొత్తం రూ.24,815 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదముద్ర

అన్నవరం, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలకు మెరుగవనున్న కనెక్టివిటీ



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రాజమండ్రి (నిడదవోలు) - విశాఖపట్నం (దువ్వాడ) మధ్య

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# బాబు జగన్ పవన్ ఒక్కటిగా ధర్మాగ్రహం

ఏపీలో అరుదైన రాజకీయ సన్నివేశం బాహాటంగా కనిపించింది. ఇంతకాలం ఏపీలోని ఎన్డీయే పార్టీలు ఒక వైపు వైసీపీ ఒక వైపు అన్నట్లుగా ఉండేది. అయితే కేంద్రం పెట్టే బిల్లులకు వైసీపీ కూడా సమయానుకూలంగా మద్దతు ఇస్తూ వస్తోంది. అదే విధంగా మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కూడా వైసీపీ ఫుల్ సపోర్టు ఇచ్చింది. కానీ లోక్ సభలో బిల్లు వీగిపోయింది. దాంతో ఎన్డీయే పక్షాలు అన్నీ ప్రతిపక్షాల మీద విరుచుకుపడుతున్నాయి. అయితే ఎన్డీయేకు ఏపీలో విపక్షం అయిన వైసీపీ కూడా జాతీయ స్థాయిలో విపక్షాలను విమర్శించడం రాజకీయ విశేషంగా చెబుతున్నారు. దేశంలోని చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే కీలక బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు చారిత్రక తప్పిదానికి పాల్పడ్డాయని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. దీని వెనక రాజకీయ దురుద్దేశం మాత్రమే లేదని, చట్ట సభలలో అవకాశాల కోసం చూస్తున్న లక్షలాది మంది మహిళలకు చేసిన అతి పెద్ద ద్రోహమని ఆయన అన్నారు. ఈ ద్రోహాన్ని దేశం మొత్తం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని బాబు హెచ్చరించారు. ఈ మేరకు బాబు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల చర్యల వల్ల దేశం ఒక చారిత్రక అవకాశాన్ని కోల్పోయిందని బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఎన్డీయేలో మరో కీలక భాగస్వామి అయిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా ఈ విషయం మీద తీవ్రంగా స్పందించారు. చట్ట సభల్లో మహిళా శక్తిని పెంపొందించే సదవకాశాన్ని ప్రతిపక్ష పార్టీలు దూరం చేశాయని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ఉంటే వారికీ గౌరవం దక్కేదని గుర్తు చేశారు. అయితే రానున్న రోజుల్లోనైనా మహిళా శక్తికి చట్ట సభల్లో సముచిత స్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ బిల్లును లోక్ సభ ముందుకు తీసుకువచ్చిన ప్రక్రియను ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా జనసేన పార్టీ స్వాగతించిందని ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే యావత్ భారత మహిళలు ఎంతో సంతోషించి ఉండేవారని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇక మహిళా బిల్లు పార్లమెంట్ లో ఆమోదానికి నోచుకోకపోవడం పట్ల వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ విపక్షం మీద ఆయన మండిపడ్డారు. ఈ పరిణామంతో మహిళలకు మాత్రమే కాదని దక్షిణ రాష్ట్రాలకు న్యాయం జరగలేదని జగన్ వ్యాఖ్యానించడం విశేషం. అంతే కాదు 2026 జనాభా లెక్కలతో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి అతి పెద్ద నష్టమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన పార్టీలు తాము ఏం సాధించాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన కోరారు. మొత్తం మీద బాబు జగన్ పవన్ ఒక అంశంలో ఇంత ఏకాభిప్రాయంతో ముందుకు రావడం ఇంతకు ముందు ఎప్పుడూ లేదు. దాంతో అంతా ఈ ముగ్గురు ట్వీట్లను ఆసక్తిగా చూస్తున్నారు.

# మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహమే: చంద్రబాబు

పూజిస్తారో అక్కడ దేవతలుంటారని నమ్మే సంస్కృతి మనది. కానీ, పార్లమెంటులో అందుకు భిన్నంగా మహిళల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు. దశాబ్దాలుగా పోరాడుతున్న మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడం క్షమించరాని నేరం" అని చంద్రబాబు మండిపడ్డారు. ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధానమంత్రి, హోంమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. "సీట్లు 50 శాతం మేర పెరుగుతాయని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే స్థాయిలో సీట్లు పెరిగేవని స్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ, ఉత్తరాదికి, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందంటూ లేనిపోని సాకులు చెప్పి, మెజారిటీ సభ్యుల మద్దతు రాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయి. ఆడబిడ్డలంటే విపక్షాలకు ఇంత చులకనా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో మాట్లాడానని, ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. 2017లోనే టీడీపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం బిల్లు కూడా తీసుకురాలేకపోయిందని విమర్శించారు. 2029 నుంచి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే సదుద్దేశంతో సవరణ బిల్లు తీసుకువస్తే, దానిని నీరుగార్చడం శోచనీయమన్నారు. "నిన్న జరిగిన ఈ విద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళతాం. ఇవాళ చేపట్టిన నిరసన కేవలం ఆరంభం మాత్రమే. జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో సమర్థవంతంగా రాణిస్తున్నారు. అలాంటి వారు చట్టసభల్లోకి వస్తే సమాజానికి న్యాయం జరుగుతుంది. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేని ఈర్ష్యతోనే బిల్లును అడ్డుకున్నారు. ఈ ద్రోహానికి పాల్పడిన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాకుండా ప్రజలు బుద్ధి చెప్పాలి. ఈ వ్యవహారంపై ప్రతి ఒక్కరినీ చైతన్యపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# 'వందేళ్లు జీవించు చిట్టితల్లీ'...

పునర్జన్మను ప్రసాదించింది. మాటలతో చెప్పలేని ఆవేదన నుంచి ఆనందభాష్పాలు రాల్చే క్షణాలకు ఈ కథ నిలువుటద్దం. అన్నగా అండగా నిలుస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, రూ.16 కోట్ల విలువైన జీవన సంజీవనిని అందించి, ఆ చిట్టి చెల్లెలి చిరునవ్వును కాపాడారు లోకేష్. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి లోకేష్ సమక్షంలోనే వైద్యులు శనివారం ఉదయం ఆ ఇంజెక్షన్ ను పునర్విక‌కు అందించారు. ఈ ఘట్టంతో కొన్ని నెలలుగా సాగిన "సేవ్ పునర్విక" ఉద్యమం విజయవంతంగా ఫలించింది. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగళ సురేష్ కుమార్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక. క్షవరం వృత్తి చేసుకుని జీవనం సాగించే సురేష్ కుమార్ కుటుంబానికి, తమ కుమార్తెకు ప్రాణాంతక వ్యాధి సోకిందని తెలియడంతో మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. పుట్టిన ఆరు నెలలైనా చిన్నారిలో కదలికలు లేకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ వైద్యులు పునర్వికకు స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ సోకినట్టు నిర్ధారించారు. ఈ వ్యాధికి అమెరికా నుంచి తెప్పించే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గమని తేల్చిచెప్పారు. దీంతో కన్నీరుమున్నీరైన ఆ తల్లిదండ్రులు, తమ కుమార్తెను కాపాడుకోవడానికి దాతల సహాయం కోరుతూ ఈ ఏడాది జనవరిలో సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించారు. "సేవ్ పునర్విక" పేరుతో సాగిన ఈ ప్రచారానికి లక్షలాది హృదయాలు స్పందించాయి. ఫిబ్రవరి నాటికి సుమారు రూ.10 కోట్ల విరాళాలు సమకూరాయి. అయినా, ఇంకా భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో, తల్లిదండ్రులు ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేష్‌ను సాయం కోరారు. వారి విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన మంత్రి లోకేష్, చిన్నారి బాధ్యతను తాను తీసుకుంటానని, చికిత్సకు అవసరమైన పూర్తి సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, కేవలం ఆర్థిక సహాయం ప్రకటించడమే కాకుండా, చికిత్స ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు అన్నీతానై పర్యవేక్షించారు. రూ.16 కోట్ల ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి హైదరాబాద్‌కు వేగంగా రప్పించేందుకు తన సిబ్బంది ద్వారా నిరంతరం సమన్వయం చేశారు. ఔషధ తయారీ సంస్థ నోవార్టిస్, రెయిన్‌బో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులతో మాట్లాడి ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రభుత్వ ధృవపత్రాలు, చెల్లింపులు, రవాణా వంటి అన్ని అడ్డంకులను తొలగించి, ఇంజెక్షన్ సకాలంలో అందేలా చూశారు. చిన్నారికి ఇంజెక్షన్ ఇస్తున్న సమయంలో ఆసుపత్రిలోనే ఉన్న లోకేష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏడుస్తున్న పునర్వికను ఎత్తుకుని లాలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. తమ కుమార్తెకు జన్మనిచ్చింది తామైతే, పునర్జన్మ ప్రసాదించింది మంత్రి లోకేష్, దాతలని పునర్విక తల్లిదండ్రులు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ చేసిన సహాయాన్ని జీవితాంతం మరువలేమని, భవిష్యత్తులోనూ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు, దాతలు, ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ వారు శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేశారు.

**ఎవరీ చిన్నారి?**

వెల్దుర్తికి చెందిన సురేష్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్వికశ్రీ గతేడాది ఏప్రిల్ 12న జన్మించింది. పుట్టిన మూడు నెలల అనంతరం పాపలో కదలికలు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కోట్లలో ఒకరికి ప్రబలే ఎస్ఎమ్ఏ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి నివారణకు రూ.16కోట్లు విలువ చేసే ఔషధం అవసరం. చిన్నారి వైద్యసేవలకు దాతలు సహకరించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. నిత్యం పడుతున్న యాతనపై గత ఏడాది నవంబరు 29న 'ఈనాడు'లో 'అందితే సాయం.. మోములో పునర్వికాసం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పాప పరిస్థితి తెలుసుకున్న దాతలు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. వీటితో పాటు సామాజిక మాధ్యమాల్లో సైతం ఈ విషయం చక్కర్లు కొట్టడంతో ప్రజలు సైతం స్పందించి విరాళాలు సేకరించి ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకొని, స్వయంగా పర్యవేక్షించి విదేశాల నుంచి ఇంజెక్షన్ తీసుకొచ్చేందుకు కృషి చేయగా.. ఆయన సమక్షంలోనే వైద్యులు పాపకు ఇంజెక్షన్ చేశారు.

**ఇంజెక్షన్ కోసం మంత్రి లోకేష్ నిరంతర పర్యవేక్షణ**

అమెరికా నుంచి ఖరీదైన ఇంజెక్షన్ ను త్వరితగతిన హైదరాబాద్‌కు రప్పించే పనిని తన సిబ్బంది ద్వారా నిరంతరం లోకేష్ పర్యవేక్షించారు. ప్రముఖ ఔషధ కంపెనీ నోవార్టీస్, రెయిన్ బో ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులను సమన్వయ పరిచారు. వైద్య పత్రాలు, ఒప్పందాలు పూర్తిచేయడం, ప్రభుత్వ ధృవపత్రాలు, వినతులు తయారీ, చెల్లింపులు, రవాణా అంశాల్లో సహాయ సహకారాలు అందించారు. పునర్విక చికిత్సలో ఎలాంటి ఆలస్యం జరగకుండా మంత్రి లోకేష్ చేసిన కృషితో నిండు ప్రాణాలు నిలిచాయి.

**ఇది పునర్జన్మే.. :** తాము పునర్వికకు జన్మనిస్తే.. మంత్రి నారా లోకేష్, మానవతాహృదయాల స్పందనతో పునర్జన్మ లభించిందని తల్లిదండ్రులు మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ చేసిన సాయాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని భావోద్వేగంతో చెప్పారు. తమ చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడేందుకు సహాయం అందించడమే కాకుండా, భవిష్యత్తులోనూ అన్ని విధాలా అండగా ఉంటానని లోకేష్ భరోసా ఇచ్చారని తెలిపారు. వైద్యం అందించిన డాక్టర్లు, స్పందించిన ప్రతి హృదయానికి, ప్రార్థించిన ప్రతీ ఒక్కరికీ, సాయం అందించిన ప్రతీ ఒక్కరికీ నమస్కారాలు తెలియజేశారు పునర్విక తల్లిదండ్రులు.

## రాజమండ్రి-విశాఖ మధ్య 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం..

# కేంద్రం ఆమోదం

198 కిలోమీటర్ల మేర మూడో రైల్వే లైను, నాలుగో రైల్వే లైను నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.9,889 కోట్లుగా ఉంది. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హౌరా-చెన్నై హై డెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ రైల్వే మార్గం తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల గుండా వెళుతుంది. తూర్పు తీర రైల్వే కారిడార్‌లో ఇది అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటిగా ఉంది, ముఖ్యంగా సరుకు రవాణాకు కీలకం. ఈ ప్రాజెక్టు పూర్తయితే అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్-సీతాపూర్ మధ్య మరో ప్రాజెక్టుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.24,815 కోట్లు. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తం 601 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ విస్తరించనుంది. ఈ కొత్త లైన్ల నిర్మాణం బొగ్గు, ఆహార ధాన్యాలు, సిమెంట్, ఎరువులు వంటి సరుకుల రవాణాను వేగవంతం చేయడంతో పాటు, పర్యాటక రంగ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

**ఏపీ శనగ రైతులకు కేంద్రం ఊరట.. కొనుగోలు పరిమితి పెంపు**

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో మద్దతు ధర పథకం కింద శనగల కొనుగోలు పరిమితిని గణనీయంగా పెంచుతూ శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, కొనుగోలు గరిష్ఠ పరిమితిని 1,13,250 మెట్రిక్ టన్నులకు పెంచుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. వాస్తవానికి తొలుత 94,500 మెట్రిక్ టన్నుల సేకరణకు అనుమతి ఇవ్వగా, ఇప్పుడు ఆ పరిమితిని పెంచారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కూడా కేంద్రం పలు చర్యలు ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో 20 లక్షల మెట్రిక్ టన్నుల బంగాళాదుంపల కొనుగోలుకు, కర్ణాటకలో కందుల కొనుగోలు గడువును మే 15 వరకు పొడిగించడానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి చౌహాన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా ఏ రైతు కూడా తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ రైతులకు అవసరమైన సహాయాన్ని తక్షణం అందిస్తామని హామీ ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయి

# దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు. ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరఫున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

# విపక్షాలు జీవితాంతం చింతిస్తాయి

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి స్పందించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన విపక్షాలు జీవితాంతం చింతిస్తాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం కేంద్రమంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని అన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ఉన్నదే కాకుండా దానిని కప్పిపుచ్చుకోవడానికి వారు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరవేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

## ఖాళీ ప్లేట్లు.. పలచటి చపాతీలు

# అమెరికా సైనికులకు ఆహార కొరత..?

పాల్గొంటున్నాయి. కొన్ని వారాలుగా యుద్ధ నౌకలు, విమాన వాహక నౌకల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి వడ్డిస్తోన్న ఆహారం ఫొటోలను తమ కుటుంబసభ్యులకు షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. అలాగే మిలిటరీ జిప్‌కోడ్స్ (విదేశాల్లోని సైనిక, దౌత్య కార్యాలయాలకు పంపే పోస్టులు)కు పోస్టల్ సేవలను నిలిపివేయడంతో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. దీంతో యూఎస్‌లోని కుటుంబాలు విధుల్లో తమ వారికి ఆహారం, ఇతర ఉత్పత్తులు పంపించేందుకు వీలు లేకుండా పోయింది. ఇక, యూఎస్ఎస్ ట్రిపోలిలో ఉన్న ఆహారాన్ని రేషన్ పద్ధతిలో వాడుకోవాల్సి వస్తోందని తెలుస్తోంది. తాజా సరకులు అనేవే లేవని ఒక మెరైనర్ తన తండ్రికి వెల్లడించారు. తన బిడ్డ కోసం షాంపూ, టూత్‌పేస్ట్, కొన్ని స్నాక్స్ పంపానని చెప్పారు. అయితే అవి ఇంతవరకు చేరలేదు. "వీలైనప్పుడు తింటున్నాం. ఎవరికైనా ఎక్కువ ఆహారం అందితే దానిని ఇతరులతో పంచుకుంటున్నాం. సరకులు చాలా తక్కువగా ఉన్నాయి" అని ఒక సెయిలర్ తన తల్లితో చెప్పి వాపోయారు. అతడికి వారి కుటుంబం ఆహారాన్ని పంపినా అది గమ్యస్థానానికి చేరలేదు. యుద్ధం వల్ల గగనతల మూసివేతలు, రవాణా సమస్యల కారణంగా ఏప్రిల్ నుంచి డెలివరీలు నిలిచిపోయాయని యూఎస్ ఆర్మీ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. మార్చి 27న ట్రిపోలి 3,500 మంది మెరైన్లతో ఇరాన్‌కు చేరువగా వెళ్లింది. ఈ ఆహార సమస్య దీనిలో ఉన్న సైనికులకు మాత్రమే పరిమితం కాలేదని ఆ కథనాలు పేర్కొన్నాయి. జనవరి 26నే పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్న యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లోనూ నాణ్యమైన ఆహారం లభించడం లేదని వెల్లడించాయి. నాణ్యత పక్కనపెడితే.. అందులోని వారు ఎప్పుడూ ఆకలితోనే ఉంటున్నారట. ఇదిలాఉంటే.. ఇరాన్ వార్‌లో భాగమైన విమాన వాహక నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలోని అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఆ నౌకలో విధులు నిర్వర్తిస్తోన్న 4500 సిబ్బంది టాయిలెట్ కష్టాలను ఎదుర్కొన్నట్లు కథనాలు వెలువడ్డాయి. యుద్ధనౌక నిరంతరం కదులుతున్నందున, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల అందులో ఉన్న చాలావరకు మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో వారు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఉద్రిక్తతల కారణంగా నెలల పాటు కొనసాగుతోన్న మోహరింపులు ఎప్పటికప్పుడు సైనికులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నట్లు కనిపిస్తోంది.

## సమాచార శాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 18**

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా శనివారం స్థానిక సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో 'జలం జీవం థీమ్ తో' "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం నుంచి కార్యాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఇది వరకు ఉన్న ఇంకుడు గుంతలను శుభ్ర పరిచి వినియోగంలోకి తీసుకొచ్చారు. సిబ్బంది తాగునీటి, ఇతర అవసరాలకు ఉపయోగపడే నీళ్ల కుండీలను శుభ్రపరిచారు. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని జలం–జీవం థీమ్ కు అనుగుణంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛత అనేది ఒక్కరోజు క్రతువు కాకుండా నిత్య కర్తవ్యంగా మారాలని అధికారులు పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఉప సంచాలకులు కె. సదారావు, డివిజనల్ పీఆర్వో డి. నారాయణ రావు, ఏఈఐఈ శ్రీనివాసరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చందనోత్సవం మీడియా పాసులపై కలెక్టర్‌కు లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ వినతి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :18**

లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఏ) ప్రతినిధుల బృందం జిల్లా కలెక్టర్ ఎం. అబిశక్త్ కిషోర్‌ను శనివారం కలెక్టరేట్‌లో కలిసి పలు అంశాలపై వినతి పత్రాలు సమర్పించింది. శ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి చందనోత్సవం సందర్భంగా మీడియా పాసులు దినపత్రికలతో పాటు పీరియాడికల్స్‌కు కూడా జారీ చేయాలని వారు కోరారు. ప్రస్తుతం మీడియా పాసులు కేవలం కవరేజ్‌కే పరిమితమై దర్శనానికి అవకాశం లేదని జరుగుతున్న ప్రచారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, మీడియా పాసులు అందరికీ జారీ చేస్తామని, దర్శనం కోసం ప్రత్యేకంగా ఉచిత టికెట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్‌ల విషయంలో స్థానిక పత్రికలకు అన్యాయం జరుగుతోందని ప్రతినిధులు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్‌లను తక్షణమే జారీ చేయాలని మరో వినతి పత్రంలో కోరారు.అదేవిధంగా, "నేషనల్ న్యూస్ ఎక్స్‌ప్రెస్" దినపత్రికపై నిబంధనలకు విరుద్ధంగా మీడియా స్వేచ్ఛకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన విచారణ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక భూకబ్జాదారుడు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదని ప్రశ్నించారు. మీడియా అక్రిడిటేషన్ కమిటీ మెజారిటీ సభ్యులు కూడా దీనికి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. తక్షణమే జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరగా, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఏ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక అధ్యక్షుడు కె. పరశురాం, జాప్ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. కీర్తనరావు, ఏఎస్ఎంఎన్ఐ మొల్లి కమల్ కుమార్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు బి. నారాయణరావు, సూర్య ప్రకాష్, ఎస్. రమణ, గౌతమ్, కె.ఎస్. చలం, గిరిబాబు, అబ్బాస్, డి. రమణ, రామరాజు, జి. ఈశ్వర్, ఎం. శ్రీనివాస్, ఎం. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## కొండను ఢీకొట్టిన వ్యాన్ – పలువురికి తీవ్ర గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం

**అల్లూరి జిల్లా,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**

అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం బొంతువలస ఘాట్ రోడ్డులో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చింతపల్లి జాతర నుంచి కొయ్యూరు వైపు వెళ్తున్న ఐచర్ వ్యాన్ అదుపుతప్పి కొండ అంచును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో పది మందికి పైగా తీవ్రంగా గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# డ్రగ్స్‌పై యుద్ధం కొనసాగుతుంది 'వజ్రప్రహార్'తో పోలీసుల గట్టి హెచ్చరిక

**గొలుగొండ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 18**

మాదకద్రవ్యాల నియంత్రణకు ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్‌డివిజన్ పరిధిలోని గొలుగొండ మండలం పాకాలపాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున భారీ స్థాయిలో కార్డన్ ఉ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలకు సహకరిస్తున్న వారిపై నిఘా కట్టుదిట్టం చేయాలని నిర్ణయించిన పోలీసులు ఉదయం 4 గంటలకే గ్రామాన్ని నాలుగు వైపులా చుట్టుముట్టి తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సీపట్నం రూరల్ సర్కిల్, టౌన్, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ఈగల్ టీం, ప్రత్యేక దళాలు కలిసి సుమారు 70 మంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గ్రామంలోని హాట్‌స్పాట్ ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు, పాడుబడిన ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 700 ఇళ్లు, 1000 మంది వ్యక్తులు, 270 వాహనాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 44 మోటార్ సైకిళ్లు, ఒక కారును



స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాత నార్కోటిక్ కేసులకు సంబంధించిన అనుమానితులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత భవిష్యత్తును మాదకద్రవ్యాలు నాశనం చేస్తున్నాయని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా 100కు



తెలియజేయాలని పోలీసులు సూచించారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమం చివరలో పోలీసులు, గ్రామస్తులతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం కీలకమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనకు ఇలాంటి ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అన్నా క్యాంటీన్ను ప్రారంభించిన హోం మంత్రి అనిత



**పాయకరావుపేట,సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ :18**

పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పట్టణంలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను మంత్రి అనిత ప్రారంభించారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనాలను స్వయంగా వడ్డించి, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేశారు. భోజనాల నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, పేదవారికి మంచి భోజనం అందించడం అన్నా క్యాంటీన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రద్దు చేసి పేదలకు భోజనం దూరం చేసిందన్నారు. 2019--2024 మధ్య కాలంలో వాటిని రాజన్న క్యాంటీన్లుగా అయినా కొనసాగించాలని కోరినా స్పందన లేకపోయిందని



అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పట్టణాలతో పాటు గ్రామీణ మండలాల్లో కూడా వీటిని విస్తరిస్తున్నామని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి అడ్డరోడ్డు సమీపంలో మరో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాయకరావుపేటలోని సరయ్య చెరువు వద్ద స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 'జలం--జీవం' నినాదంతో చెత్త తొలగింపు కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సరయ్య చెరువును అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన ఆమె, చెరువును శుభ్రపరచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**



విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఏప్రిల్ 18న విజయనగరం చేరుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని అశోక్ బంగ్లాలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలుసుకున్నారు. ఈ భేటీలో జిల్లా పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు శాఖ చేపడుతున్న భద్రతా చర్యలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఎస్పీ వివరించారు. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, నేరాల నియంత్రణలో తీసుకుంటున్న చర్యలను గవర్నర్‌కు తెలియజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ కి ఎస్పీ దామోదర్ మొక్కను అందజేసి సత్కరించారు. జిల్లాలో పోలీసు శాఖ నిర్వహిస్తున్న పనితీరును గవర్నర్ అభినందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

# భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 27




భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 27 ప్రకారం, ఏ వ్యక్తికైనా నిర్దిష్ట మతం లేదా మతపరమైన సంస్థ లేదా తెగ ప్రచారం లేదా నిర్వహణ కోసం పన్నులు చెల్లించమని బలవంతం చేయకూడదు. ప్రభుత్వం వసూలు చేసే పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రత్యేకంగా ఒక మతానికి అనుకూలంగా వినియోగించడం ఈ అధికరణం ద్వారా నిషేధించబడింది. ఈ విధంగా, ఆర్టికల్ 27 భారతదేశ లౌకిక స్వభావాన్ని కాపాడుతూ, ప్రభుత్వం అన్ని మతాల పట్ల సమాన దృష్టితో ఉండాలని నిర్దేశిస్తుంది. ఈ అధికరణం ముఖ్య ఉద్దేశ్యం పన్ను చెల్లింపుదారుల డబ్బును ఏదైనా ఒక మత విశ్వాసం లేదా మత సంస్థ అభివృద్ధికి వినియోగించకుండా నిరోధించడం. దీని ద్వారా పౌరుల మత స్వేచ్ఛ మరియు సమానత్వం రక్షించబడుతుంది. అయితే, మత సంస్థల పరిపాలన లేదా నిర్వహణకు సంబంధించిన ఖర్చులను భరించేందుకు వసూలు చేసే రుసుములు పన్నులుగా పరిగణించబడవు. అందువల్ల, అలాంటి రుసుములు ఆర్టికల్ 27 ఉల్లంఘనగా పరిగణించబడవు. ఈ సూత్రాన్ని న్యాయస్థానాలు కూడా స్పష్టంగా వివరించాయి.

**కేసులో ఉదాహరణ:** కమిషనర్, హిందూ రిలిజియస్ ఎండోమెంట్స్, మద్రాస్ వర్సెస్ శ్రీ లక్ష్మీంద్ర తీర్థ స్వామియార్ ఆఫ్ శిరూర్ మఠ్ (1954) కేసులో సుప్రీంకోర్టు, మత సంస్థల పర్యవేక్షణ మరియు పరిపాలన కోసం వసూలు చేసే రుసుములు పన్నులు కాదని, అవి సేవలకు ప్రతిఫలంగా వసూలు చేసే రుసుములు మాత్రమేనని పేర్కొంది. కాబట్టి, అలాంటి రుసుములు ఆర్టికల్ 27కు విరుద్ధం కావని స్పష్టం చేసింది. ఈ విధంగా, ఆర్టికల్ 27 ప్రభుత్వం మతపరంగా తటస్థంగా ఉండేలా చేస్తూ, ప్రజా నిధులను ఏదైనా నిర్దిష్ట మతానికి అనుకూలంగా వినియోగించకుండా నిరోధించే ముఖ్యమైన రాజ్యాంగ పరిరక్షణగా నిలుస్తుంది.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జ్.**

## భూగర్భ జలాల సంరక్షణపై డిప్యూటీ కలెక్టర్ అవగాహన



**అనకాపల్లి, వైటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**

అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా "జలధార -- జల హారతి" కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థులకు భూగర్భ జలాల సంరక్షణ అవసరంపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు తాగునీటి కొరత రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వచేసే విధానాలను ప్రోత్సహించడం, చెరువులు, కుంటలు, కాలువలను శు భ్రపరచడం, భూగర్భ జలాల పునర్వినియోగంపై దృష్టి పెట్టడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. ఎంజీఎన్ఆర్ఇజీఎస్ కార్మికులతో కలిసి గ్రామ పరిసరాల్లో చేపట్టిన పనులను పరిశీలించి, జల సంరక్షణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసి, వారి శ్రమను అభినందించారు. మండల పరిషత్ ఎంపీడీవో ఆశాజ్యోతి మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. ఏవో రాము, ఏపీవో సుప్రియలు కూడా జల సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాలాపు శాంతి, సూరి అప్పారావు, పీ4 మార్గదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, ఎంజీఎన్ఆర్ఇజీఎస్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో జల వనరుల పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల్లో నీటి సంరక్షణపై చైతన్యం పెరిగి, భవిష్యత్‌లో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## విశాఖ ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన మహాదాస్యం శ్రీనివాసరావు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 18**

విశాఖపట్నంలో ట్రాఫిక్ ఏసీపీగా మహాదాస్యం శ్రీనివాసరావు ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన, ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు విజయనగరం ఎస్‌డీపీఓగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు, బదిలీపై విశాఖ నగరానికి వచ్చారు. నగరంలో గతంలో మధురవాడ ఏసీపీగా సమర్థవంతంగా సేవలందించారు. అలాగే టూ టౌన్, గాజువాక, పీఎం పాలెం పోలీస్ స్టేషన్లలో ట్రాఫిక్ ఎస్ఐగా, పీఎం పాలెంలో ట్రాఫిక్ సీఐగా కూడా పనిచేసి విశేష అనుభవం సంపాదించారు.



# విశాఖలో హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన





**ఎండాడ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:18**

విశాఖపట్టణంలోని ఎండాడ పరిధిలో ఐదెకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం శంకుస్థాపన చేశారు. వేద మంత్రోచ్ఛరణలు, శాస్త్రోక్త పూజల నడుమ సహచర న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ రవి చీమలపాటిలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం మీట నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సహచర న్యాయమూర్తులతో పాటు గునపం పట్టుకొని, సిమెంట్ వేసి నిర్మాణాలకు అంకురార్పణ చేశారు. ఇతర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భూమిపూజ చేసిన ప్రాంతం నుంచి సాగర తీరాన్ని వీక్షించారు. కొండపై భాగం నుంచి కనిపించే పరిసరాలను పరిశీలించారు. నిర్మాణ ప్రక్రియలు, ఇతర అంశాలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను కోర్టు, జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ఫస్ట్ ఏడీజే వెంకటరమణ, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఇతర న్యాయమూర్తులు, కోర్టు అధికారులు, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. శంకుస్థాపన క్రతువు అనంతరం కొండ దిగువ భాగంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు హైకోర్టు న్యాయమూర్తులు చేరుకున్నారు. జిల్లా కోర్టులో పని చేసే న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, అధికారులతో వారు బృంద చిత్రాలు దిగారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను జిల్లా కోర్టు న్యాయమూర్తులు, అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి

### - కాంగ్రెస్ డిమాండ్



**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:18**

మహిళా రిజర్వేషన్ల బిల్లును వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ పరిణామాల నేపథ్యంలో బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. శనివారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడిన డీసీసీ జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా కిరణ్ కుమార్, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఏవో గంటా మోహన్ రావు, పట్టణ నాయకులు బంకురు ప్రకాశ్ రావు తదితరులు మాట్లాడుతూ--- మహిళా రిజర్వేషన్ పేరుతో డిలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తెచ్చి కొన్ని రాష్ట్రాలకు అన్యాయం చేయాలని బీజేపీ ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ విధానాన్ని ఇండియా కూటమి అడ్డుకుందని పేర్కొన్నారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. మహిళలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే అమలు ప్రక్రియను ప్రారంభించాలని, అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఇండియా కూటమి కట్టుబడి ఉందని, రాజ్యాంగాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నాలను తిప్పికొట్టిందని తెలిపారు. మహిళలు సహా అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కర్షకులు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, బలహీన వర్గాల సంక్షేమాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీపై విమర్శలు గుప్పించారు. ప్రజలు ఈ పరిస్థితులను గమనిస్తున్నారని, భవిష్యత్తులో తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు ద్వారా మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని, స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు బలోపేతం చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

## కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరి ని కలిసిన ఎంపీ హరీష్ బాలయోగి...



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

ఢిల్లీ లోని మంత్రి కార్యాలయంలో కేంద్ర విద్యాశాఖ సహాయ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక శాఖ మంత్రి జయంత్ చౌదరి ని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమలాపురం పార్లమెంట్ పరిధిలోని యువతకు విద్యా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి జయంత్ హామీ ఇచ్చినట్లు ఎంపీ హరీష్ తెలిపారు.

## ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరి - హోం మంత్రి అనిత



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**

జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫైర్ సర్వీసెస్ విభాగం నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే కీలక పాత్రను అధికారులు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమోల ద్వారా వివరించామని చెప్పారు. అత్యాధునిక పరికరాలు, సాంకేతికత వినియోగంతో ఫైర్ సర్వీసులను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.232 కోట్లతో కొత్త ఫైర్ వాహనాలను కొనుగోలు చేసి, వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని తెలిపారు. అదేవిధంగా డ్రోన్ల వినియోగాన్ని కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, విపత్తుల సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది సేవలందిస్తున్నారని ప్రశంసించారు. హుద్‌హుద్ తుఫాను, విజయవాడ బుడమేరు ఘటనల్లో ఫైర్ సిబ్బంది చేసిన సేవలను ఆమె గుర్తుచేశారు. పరిశ్రమల్లో చిన్నపాటి ప్రమాదాలు కూడా జరగకుండా ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫైర్ సిబ్బందికి అన్ని రంగాల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించిన సంస్థలను హోం మంత్రి సత్కరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులు హోం మంత్రి అనితను ఘనంగా సత్కరించారు.



## చందనోత్సవానికి కట్టుదిట్టమైన బందోబస్తు - సీపీ శంఖబ్రత బాగ్చి

### డ్రోన్లతో పర్యవేక్షణ... భక్తుల భద్రతే ప్రాధాన్యం



**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 18**

ఈ నెల 20-04-2026న నిర్వహించబడనున్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్, అధికారులు మరియు సిబ్బందికి సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. గోశాల వద్ద ఉన్న కే. కన్వెన్షన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన సమయంలో భక్తులకు తక్షణ సహాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాంగ్ పార్కింగ్‌కు అవకాశం ఇవ్వకుండా హెవీ టోయింగ్ వాహనాలను వినియోగించి వాహనాలను తరలించాలని ఆదేశించారు. ఘాట్ రోడ్డులు, రద్దీ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. క్యూలైన్ల వద్ద దేవస్థానం అధికారులతో సమన్వయం చేసుకుని భక్తుల రాకపోకలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్‌లు, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పార్కింగ్ స్థలంలో భక్తుల రవాణా కోసం బస్సులు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సుమారు 2300 మంది అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామని, డ్రోన్ సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని వెల్లడించారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పిల్లలు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, ఉచిత దర్శన లైన్లు సహా అన్ని క్యూలైన్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చందనోత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీపీ సూచించారు.



## సాలూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం..మున్సిపల్ పార్క్‌లో విస్తృత స్వచ్ఛత పనులు

### పాల్గొన్న మంత్రి సంధ్యారాణి





**సాలూరు, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సాలూరు మున్సిపల్ పార్క్‌లో స్వచ్ఛత కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి, జాయింట్ కలెక్టర్,స్పెషల్ ఆఫీసర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వారు స్వయంగా పార్క్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో మాట్లాడుతూ, పార్క్ చుట్టూ రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, జిమ్‌ను ఆధునిక పరికరాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో వినియోగంలో లేని జిమ్ సామగ్రిని పార్క్‌లో ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పార్క్‌ను యువత, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండేలా ఆరోగ్యకరమైన వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు. స్వచ్ఛతే సేవ అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో శుభ్రతపై అవగాహన పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించింది.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగవంతం..

### ఆలమూరులో రూ.60 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు..

### మహిళలు ఎమ్ఎస్ఎమ్ఈ యూనిట్లను ఏర్పాటుచేసుకోవాలి..

### ఎమ్మెల్యే బండారుకు ఘన సత్కారం...



**పాలమూరు సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద సుమారు రూ.30లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి ఆయన కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ తో కలిసి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ఆలమూరు మండలం పరిషత్ ఆవరణలో రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఆలమూరు మండల మహిళా సమైక్య సంఘం కార్యాలయాన్ని సందర్శించి మహిళా సంఘాలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఎమ్ ఎస్ ఎమ్ ఈ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని వారికి సూచించారు. ఆలమూరు బార్ అసోసియేషన్ వారు ఎమ్మెల్యే ను సత్కరించి పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన సెటిల్ కోర్టు మరియు ప్రజా దర్బార్ వేదికను ప్రారంభించారు. తదుపరి వ్యవసాయ శాఖ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయాలను సందర్శించారు. వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ స్టాల్ ను పరిశీలించి, అధికారులను అభినందించారు.ఆలమూరు మండలం వ్యాప్తంగా ఉన్న 46 మంది డ్వాక్రా యానిమేటర్లకు ఫోన్లను అందజేశారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరావు, పీఏసీఎస్ చైర్మన్ వంటిపల్లి సతీష్, పలువురు రూ.80 వేలతో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను ప్రారంభించి, దాతలను అభినందించారు.అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన సెటిల్ కోర్ట్ ను అయన ప్రారంభించారు.ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ లను ఘనంగా సత్కరించారు.

## లిహజ్ యాత్రికులకు పచ్చజెండా ఊపి వీడ్కోలు పలికిన మంత్రులు ఎమ్మెల్యే



**గన్నవరం:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ :18**

గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతున్న ముస్లిం మైనార్టీ సోదరులను నాయకులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్ హాల్‌లో శనివారం మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు ఎన్.ఎం.డి. ఫరూఖ్, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుంటూరు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ. షరీఫ్, నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, అనంతరం పచ్చ జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే మక్కా యాత్రను జీవితంలో ఒక్కసారైనా చేయాలనే కోరిక కలిగి ఉంటారని తెలిపారు. అలాంటి హజ్ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు సుమారు 1,987 మంది యాత్రకు బయల్దేరగా, విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి 353 మంది వెళ్ళటం ఆనందకరమన్నారు. మైనార్టీల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ఇమామ్‌లు మరియు మౌజంలకు ఆర్థిక సహాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. త్వరలోనే మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మరిన్ని ఆర్థిక పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో హజ్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అన్ని వర్గాలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అల్లా కృప రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షించారు.

## మెరిట్ విద్యార్థులకు ప్రశంసలు



**కాట్రేనికోన సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

ప్రభుత్వ కళాశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ దేగల రత్నశ్రీ,విద్యార్థి ముళ్ళ సత్యనారాయణ ను ఉప్పూడి గ్రామ మాజీ సర్పంచ్ రాంబాల రమేష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులురంబాల దొరబాబు అభినందించి వారికి సీల్డ్ లను బహుకరించారు.ఈ సందర్భంగా రంబాల రమేష్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ప్రభుత్వ కళాశాలలో చదువుకుని మంచి మార్కులను సాధించి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారని కొనియాడారు. ఇంటర్మీడియట్ పరీక్షలో దేగల రత్నశ్రీ 1000/976 మార్కులు ముళ్ళ సత్యనారాయణ 1000/962 మార్కులను సాధించి వారి ప్రతిభను చాటుకున్నారు ఇలాంటి మరెన్నో అద్భుతాలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాగాపు పట్టాభి,పోలిశెట్టి నాగబాబు,జొన్నాడ రాజారావు ర్యాలీ బద్రి తదితరు పాల్గొన్నారు.

## అగ్ని మాపక వారోత్సవాలలో 5వ రోజు



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 18 సిటిజన్ టైమ్స్**

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 5వ రోజు 18 వ తేదీన పీలేరు పట్టణం లోగల గ్యాస్ గొడౌన్ శ్రీ దుర్గ గ్యాస్ ఏజెన్సీ మరియు పెట్రోల్ బంక్లు (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, భారత్ పెట్రోల్ బంక్)ల యందు పనిచేసే సిబ్బంది కి మరియు ప్రజలకు పెట్రోల్ బంక్ నందు తీసుకోవలసిన జాగ్రతలు తెలియజేస్తూ గ్యాస్ ,ఆయిల్, ఎలక్ట్రికల్ ఫైర్స్ జరిగినప్పుడు ఏవిదంగా మంటలను అదుపుచేయాలన్న అంశాల మీద, ఫైర్ ఎక్విప్మెంట్ పై అవగాహన కల్పించడమైనది. మరియు కరపత్రములు పంచడమైనది. ఏదయిన ప్రమాదం జరిగిన ఎడల అగ్నిమాపక కేంద్రమునకు సమాచారము అందించాలని 101 మరియి 08584 244399, 9963736587 నంబర్లు ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి సి భాస్కర్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామాలతోనే స్వర్ణ ఆంధ్ర సాకారం

- కొత్తూరులో ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం
- స్వయంగా చెత్త సేకరించి, శ్రమదానం చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్..
- 23 చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించి గ్రామాలకు పంపిణీ
- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి, భారీ ర్యాలీ, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ

**పెదపాడు (కొత్తూరు):( సిటిజన్ టైమ్స్): ఏప్రిల్ 18**

పరిశుభ్రమైన గ్రామాలను నిర్మించుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని సాధించగలమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా, శనివారం పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన లి"స్వచ్ఛ దెందులూరు"లి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే శ్రమదానం - చెత్త సేకరణ:** ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా కొత్తూరు గ్రామ వీధుల్లో పర్యటించి చెత్తను సేకరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశారు. ఎమ్మెల్యే స్వయంగా పారిశుధ్య పనుల్లో పాల్గొనడం గ్రామస్తులలో మరింత ఉత్సాహాన్ని నింపింది.

**వాహనాల పంపిణీ - పారిశుధ్య సిబ్బందికి సూచనలు:** గ్రామాల్లో చెత్త సేకరణను మరింత బలోపేతం చేసేందుకు, ఎమ్మెల్యే 23 నూతన చెత్త సేకరణ వాహనాలనుజెండా ఊపి ప్రారంభించి వివిధ గ్రామాలకు పంపిణీ చేశారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడా బహిరంగ చెత్త కుప్పలు కనిపించకుండా చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. చెత్త సేకరణ సమయంలోనే తడి చెత్త మరియు పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**ర్యాలీ - ప్రతిజ్ఞ:** కార్యక్రమానికి ముందు, ఎమ్మెల్యే కొత్తూరు గ్రామంలోని స్వర్గీయ ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ కూటమి




నాయకులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, గ్రామస్తులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటామని అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

**ప్రజలకు పిలుపు:** ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. "స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు." ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శనగ రైతులకు ఊరట...

## కేంద్రం అనుమతితో కొనుగోలు పెంపు

- మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కేంద్రం గ్రీన్ సిగ్నల్
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రి అచ్చెన్న
- మిగిలిన శనగలను కూడా త్వరలో కొనుగోలు చేయిస్తాం, రైతులు ఆందోళన చెందొద్దు
- క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు, దిగుబడి పెరిగిందని కేంద్రానికి వివరించిన మంత్రి అచ్చెన్న
- ప్రత్యేక పరిస్థితుల్లో మొక్కజొన్న కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి
- ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తో మాట్లాడి, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి చౌహాన్ హామీ

**అమరావతి:( సిటిజన్ టైమ్స్ ) ఏప్రిల్ 18:**

రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తోందని, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయబోమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో శనివారం



విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శనగలు, మొక్కజొన్న పంటల పరిస్థితిని సమగ్రంగా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్రంలో శనగల సాగు గణనీయంగా పెరిగి, మొత్తం సుమారు 7,13,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తయిందని, మిగిలిన పంటను రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. అదనంగా 1,78,250 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15,000 మెట్రిక్ టన్నుల శనగలు తక్షణమే కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 68,750 మెట్రిక్ టన్నుల శనగలను కూడా త్వరలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి కేంద్రానికి వివరించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. మిర్చి, పొగాకు రైతులు క్రాప్ డైవర్షన్ చేసి మొక్కజొన్న సాగు విస్తీర్ణాన్ని పెంచారని, దీంతో దిగుబడులు అధికంగా వచ్చినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది ఇరాన్ యుద్ధ ప్రభావం, ఈతనాల ఉత్పత్తిలో బ్రోకెన్ రైస్ వినియోగం పెరగడం వల్ల మొక్కజొన్నకు డిమాండ్ తగ్గిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. మొక్కజొన్న పంట కొనుగోలు పీడీఎస్ స్కీంలో లేకపోయినప్పటికీ, ప్రస్తుత ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి తో వెంటనే మాట్లాడి, మొక్కజొన్న కొనుగోలు అంశంపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, కేంద్రంతో సమన్వయం చేసుకుని రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# సహజ మరియు సేంద్రియ ఆహార ఉత్పత్తుల మేళాలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

**ఏలూరు:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్:18:**

ఏలూరు డిసిఎంఎస్ ఫంక్షన్ హాల్ నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సహజ మరియు సేంద్రియ ఆహార ఉత్పత్తుల మేగా మేళాలో ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి తో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజుజ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి , దెందులూరు నియోజకవర్గం శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీ చాగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సేంద్రియ పండ్లు, కూరగాయలు, సహజ ఆహార పదార్థాలు, ఇతర తినుబండారాలను ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు కి సాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమం రైతులకు మరియు వినియోగదారులకు ఒక మంచి వేదికగా నిలిచింది. అనంతరం ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ సేంద్రియ మరియు సహజ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా రైతులకు



నేరుగా వినియోగదారులతో సంబంధం కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఇటువంటి మేళాలు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం పై అవగాహన పెంచడమే కాకుండా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కూడా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే వేదికగా ఈ మేళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన సమాజం

**జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు**



**అమలాపురం సిటిజన్ టై ఏప్రిల్ 18**

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన సమాజం సాధ్యమని కలెక్టరేట్ పరిపాలనాధికారి కె. కాశీశ్వరరావు రెవిన్యూ సిబ్బందికి పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యా లయంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ పరిపాల నాధికారి కె. కాశీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అందరూ పాల్గొని కలెక్టరేట్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.ఈ సంద ర్భంగా ఏఓ కాశీశ్వరరావు మాట్లా డుతూ పరిసరాల పరిశుభ్రత జల వనరుల పరిరక్షణ అంశాల పట్ల ప్రతి ఒక్కరూ మెలకువలు పాటించి భావితరాలకు మెరుగైన వాతావరణాన్ని జల సంపదను అందించాలన్నారు. సమాజంలో పౌరులు తమ రోజువారి జీవన శైలిలో కొంత భాగం పరిశుభ్రతకు తప్పని సరిగా కేటాయించాలన్నారు. పరి శుభ్రత ప్రాధాన్యత అంశం గా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా కార్యాలయ వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చడమే కాకుండా, ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. కార్యాలయ ఆవరణలోని వ్యర్థాలను తొలగించి,మొక్కలకు నీరు పోసి, ప్లాస్టిక్ రహిత ప్రాంగ ణంగా మార్చడానికి సిబ్బంది అందరూ శ్రమ దానం చేశారన్నారు స్వచ్ఛత అనేది ఒక్క రోజుతో ముగిసేది కాదని, ప్రతి ఒక్కరూ తమ పరిస రాలను నిరంతరం శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల సూపరింటెం డెంట్లు, సెక్షన్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది భరత్ కార్యాలయ ప్రాంగణంలోవివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## డి.పి.ఎస్ విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

స్థానిక అమలాపురం సమనస గ్రామంలో గల ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బి ఎస్ ఇ పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు (494) సాధించిన విద్యార్థులను పాఠశాల తరుపున సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఊరేగింపుగా తీసుకుని గడియారం స్తంభం వరకు వెళ్లడం జరిగింది.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, జిల్లా విద్యాశాఖాధికారి పి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విద్యార్థులను అభినందించారు. ముందు ముందు భవిష్యత్తులో ఉత్తమ ర్యాంకులు సాధించాలని కోరుకున్నారు. తదుపరి పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవోపేతంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న డా. అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి. నాగేశ్వరరావు సాలువాతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సత్కరించడమే కాకుండా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నగదు బహుమతిని ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇంతటి గౌరవం లభించడానికి కారణం పాఠశాలని, అందుకు కారణమైన మను విహార్ కి,ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముందు ముందు మరిన్ని విజయాలు పాఠశాల సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాయుడు, డైరెక్టర్స్ ,ప్రిన్సిపాల్ మను విహార్, స్నేహప్రియ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మల్టీస్పెషాల్టీ సేవలు మన్యం ప్రజలకు ఎప్పుడో...?

## ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్





**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**

పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు మల్టీస్పెషాల్టీ వైద్య సేవలు ఇంకా అందుబాటులోకి రాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా కిరణ్ కుమార్, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఏవో గంటా మోహన్ రావు, పట్టణ నాయకులు బంకురు ప్రకాశ్ రావు తదితరులు మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణంలో వైసీపీ, కూటమి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో కూడా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందకపోవడం బాధాకరమన్నారు. ఆసుపత్రి నిర్మాణం నిర్దిష్ట ఆకారం లేకుండా జరుగుతుండటం, తరచూ ప్రణాళికలు మారడం వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. నిర్మాణంలో ఇరుకైన గదులు ఏర్పాటు చేయడం వల్ల రోగులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆసుపత్రి వాతావరణం అసౌకర్యంగా మారి, రోగులకు మరింత ఇబ్బందులు కలిగించే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల పనులు నిలిచిపోతున్నాయని ఆరోపించారు. 2019–20లో సుమారు రూ.21.15 కోట్లతో ప్రారంభమైన ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడాన్ని ప్రస్తావించారు. ఈ పనులకు సంబంధించిన సుమారు రూ.6 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అలాగే 2023లో రూ.58 కోట్లతో ప్రారంభమైన మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయని, దాదాపు రూ.28 కోట్ల బిల్లులు ఇంకా చెల్లించాల్సి ఉన్నట్లు పేర్కొన్నారు.బిల్లులు చెల్లించకుండా పనులు ఎలా పూర్తి అవుతాయని ప్రశ్నించిన నాయకులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా ప్రజలు నష్టపోతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బిల్డింగ్స్ విభాగం సీనియర్ ఇంజనీర్ పీవీ వెంకట దుర్గాప్రసాద్‌ను కలిసి నిర్మాణ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

## స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### జల సంరక్షణను ప్రజా ఉద్యమంగా చేపడదాం

### ఎమ్మెల్యే ఆనందరావు





**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

పురపాలక సంఘం పరిధిలోని చంద్రన్న పార్క్ వద్ద శనివారం నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర జలధార' కార్యక్రమంలో అమలాపురం శాసనసభ్యులు ఆనందరావు,జిల్లా కలెక్టర్ మహేష్ రావిరాల సంయుక్తంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు జల సంరక్షణ ,పట్టణ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రకృతి వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, ముఖ్యంగా నీటి వనరుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ జలధార కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని,నీటిని అందించడమే స్వర్ణాంధ్ర లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జలధార కార్యక్రమం కింద జిల్లాలో నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు,భూగర్భ జలాల పెంపు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు వివరించారు. నీటి సంరక్షణను ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.జల సంరక్షణపై మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేసిన ఎమ్మెల్యే ,పార్క్ పరిసరాలను పరిశీలించి,అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,కార్యకర్తలు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హస్తం అస్తమయం కాబోతుంది -జగతా శాంతి

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**



భారతీయ జనతా పార్టీ మహిళా నాయకురాలు జగతా శాంతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్, ది లిమిటేషన్ రాజ్యాంగ సవరణ బిల్లును కాంగ్రెస్ కూటమి వ్యతిరేకించి మహిళా లోకం పట్ల తమ వైఖరి తెలియజేసిందని, దశాబ్దాలుగా మహిళా సాధికారతను తొక్కుతూ వస్తుందని, స్వాతంత్ర్యానికి ముందు అస్తమయం ఎరుగని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మన దేశ ప్రజలందరూ స్వాతంత్ర్య ఉద్యమం చేసి, ఎలా అయితే అస్తమయం చేశారో అదే బ్రిటిష్ స్థాపించిన కాంగ్రెస్ పార్టీని మహిళా లోకం భవిష్యత్తులో అస్తమయం చేస్తారని ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం కాంగ్రెస్ పార్టీ మరియు కూటమి పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు.మహిళా సాధికారత దేశ అభివృద్ధికి భాజపా కట్టుబడి ఉందని తెలియజేశారు.

## మేడిచర్లపాలెం గ్రామ పంచాయితీ వద్ద స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

### త్రాగునీరు వనరులపై అవగాహన

**మలికిపురం సిటిజెన్ టైమ్స్ ఏప్రిల్ 18**

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం మలికిపురం మండలంలోని 21 గ్రామ పంచాయితీలలో నిర్వహించడం జరిగినది. జలం-జీవం థీమ్ తో గ్రామ పంచాయితీల పరిధిలో ఉన్న చెరువులు, మంచినీటి ప్రాజెక్టు చెరువులు శుభ్రపరిచే కార్యక్రమాలు, త్రాగునీరు వనరులు పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడినది. మేడిచర్ల పాలెం గ్రామ పంచాయితీ వద్ద జరిగిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి ఎంపిడిఓ జి.మిల్టన్, డిప్యూటీ ఎంపిడిఓ ఆర్.ఎస్.ఎస్.సూరపరాజు గ్రామ పెద్దలు మల్లిపూడి సత్తిబాబు, మాజీ సర్పంచులు, పెద్ద సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు. జలం-జీవం కార్యక్రమం గురించి వివరించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయడం జరిగినది. శాసన సభ్యులు, రాజోలు వారి సూచనలు తో మేడిచర్లపాలెం గ్రామ పంచాయితీ వద్ద గల చెరువును అభివృద్ధి చేయుటకొరకు చెరువు ను పరిశీలించి అభివృద్ధి పనులు నిమిత్తం ఎస్టీమెట్లు తయారు చేయాలని, దానికి అనుగుణంగా గ్రామ పంచాయితీ తీర్మానము చేసి ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయితీ కార్యదర్శి కె.రజని కి సూచించడమైనది. ఈ కార్యక్రమానికి ప్రజల మద్దతు ఉంటుందని, చెరువు అభివృద్ధికి సహకరిస్తామని గ్రామస్తులు హామీ ఇచ్చారు. మేడిచర్ల పాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఓ జి.మిల్టన్,డిప్యూటీ ఎంపిడిఓ ఆర్.ఎస్.ఎస్.సూరపరాజు, సెక్రటరీ శ్రీమతి కె.రజని, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు మల్లిపూడి సత్తిబాబు, చినవెంకన్న నాయుడు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. లక్కవరం గ్రామ పంచాయితీ గ్రామ సభ 2025-2026 సం.వార్షిక లెక్కలు 2026-2027 ప్రణాళిక కొరకు ప్రతిపాదనలు నిమిత్తం లక్కవరం గ్రామ పంచాయితీవద్ద స్పెషల్ ఆఫీసర్ ఓ ఎంపిడిఓ జి.మిల్టన్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించబడినది. గ్రామ పంచాయితీ సెక్రటరీ గత ఆర్థిక సంవత్సరం జమ ఖర్చులు సభ దృష్టికి తీసుకొని



రావడం జరిగినది. గ్రామంలో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధి, గ్రామంలోని కచ్చ డ్రైన్ పూడిక తీయుట,రోడ్ల ప్రతిపాదనలు తదితర అంశాలు గ్రామ సభలో చర్చించడమైనది. కచ్చా డ్రైన్ పూడిక తీసే విషయంలో గ్రామస్తులు సహకరించాలని స్పెషల్ ఆఫీసర్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమం ప్రజలకు తెలియచేయాలని,వచ్చిన నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో అవసరమైన రోడ్లు గుర్తించగా వాటిలో మొదటి ప్రాధాన్యత క్రమంలో కొన్ని రోడ్లు మంజూరు చేయాలని,శాసన సభ్యులకు సమర్పించుటకు గ్రామ సభ ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. రానున్న కాలంలో లో వోల్టేజ్ సమస్యకు ఏకైక పరిష్కారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ -- సోలార్ రూఫ్ టాప్ స్కీము పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఎస్.సి, ఎస్.టి మరియు ఇతరులు శ్లాబ్ ఇంటి పై కప్పు మీద ఈ సోలార్ రూఫ్ టాప్ యూనిట్ పెట్టుకోవడానికి అనుమతి పత్రాలు ఇచ్చేలా ఇంటి వ్యక్తులకు అవగాహన కల్పించే కార్యక్రమం గ్రామ పంచాయితీ ద్వారా చేస్తున్నామని దానికి నాయకులు సహకరించాలని సెక్రటరీ జి.వి.వి. మైథిలి కోరారు. ఈ కార్యక్రమంలో లక్కవరం గ్రామ పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ ,ఎంపిడిఓ మలికిపురం జి.మిల్టన్, సెక్రటరీ జి.వి.వి.మైథిలి,మాజీ సర్పంచ్ కోట పుష్పకుమారి, గ్రామ పెద్దలు మంగెన నరసింహారావు, దొరబాబు, సూర్యప్రకాశరావు, సచివాలయ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తానే లంక లో ఆక్వా ప్రాన్ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ మహేష్ కుమార్



**ముమ్మిడివరం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

కోనసీమ వంటి అధిక వర్షపాతం ,తేమ ఉన్న ప్రాంతాల్లో ఆక్వా ప్రాన్ పద్ధతి గురుకుల పాఠశాలలకు అత్యంత అనువైనదని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు శనివారం మండల పరిధిలోని తానేలంక సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్మిస్తున్న ఆక్వా ప్రాన్ విధానంలో నీటిని మలాన్ని విడదీసి నీటిని శుద్ధి చేసే ప్లాంట్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలోని విద్యార్థిని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న గురుకుల పాఠశాలల్లో సెప్టిక్ ట్యాంకులు త్వరగా నిండిపోవడం అనేది ఒక ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీనికి ప్రధాన కారణం మరుగుదొడ్ల నుండి వచ్చే వ్యర్థాలతో పాటు విపరీతమైన నీరు కూడా ట్యాంకులోకి చేరడం కారణమన్నారు.సెప్టిక్ ట్యాంకులోకి వెళ్లే నీటిని మధ్యలోనే మళ్లించి, మలాన్ని విడదీసి నీటిని శుద్ధి చేసి మొక్కలకు పంపే ఈ ఆధునిక ఆక్వా ప్రాన్ విధా నంలో 11 యూనిట్ల ను రూ కోటి 10 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మురికి నీటి విభజన చేసిన పిదప మలాన్ని సెపరేట్గా విడదీసి ట్యాంకులకు మళ్లించి సేంద్రియ ఎరువుగా మార్చడం జరుగుతుందన్నారు. దీనిని నేరుగా మొక్కలకు వాడుకోవచ్చు నన్నారు నీటిని ఆర్వో ద్వారా శుద్ధి చేసి ప్రాంగణంలో మొక్కల పెంపకానికి వినియోగిస్తారన్నారు.అత్యంత సహజ మైన, ఖర్చు తక్కువ విధానం సెప్టిక్ ట్యాంకును తరచుగా ఖాళీ చేయాల్సిన అవసరం ఉండదన్నారు.సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కోసం చేసే ఖర్చు తగ్గుతుందన్నారు.దోమలు వ్యాప్తి లేకుండా పర్యావరణానికి మేలు చేస్తుందన్నారు. గురుకులంలో ఆవరణలోని మొక్కలకు ప్రత్యేకంగా మంచి నీటిని వాడాల్సిన పనిలేదన్నారు. దీనివల్ల క్యాంపస్ పచ్చద నంతో నిండి ఉండే ఉండటమే కాకుండా ఆరోగ్యకర మైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.అనంతరం ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ నాడు నేడు పనులను పూర్తి చేయాలని, పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం నవీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ఏవీఎస్ రాజన్, డి సి హెచ్ ఎస్ కార్తీక్, డి ఈ లు రాంప్రసాద్, రాజేంద్ర సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

### బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం-ప్రజాదర్బార్‌లో 49 వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

అమలాపురం శాసనసభ్యులు ఆనందరావు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 'ప్రజాదర్బార్' కార్యక్రమం నిర్వహించబడింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు మొత్తం 49 అర్జీలను స్వీకరించారు. వీటిలో ప్రధానంగా పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, డ్రైనేజీ సమస్యలు మరియు ఇతర వ్యక్తిగత సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు గారు మాట్లాడుతూ.. "ప్రజలకు చేరువగా ఉండి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ఈ ప్రజాదర్బార్ ముఖ్య ఉద్దేశం. ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులకు పంపి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా



చూడటమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. అందిన 49 అర్జీలలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోకూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నీటి భద్రత నీటి వనరుల సంరక్షణ మన బాధ్యత ఎమ్మెల్యే



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 18**

నీటి వినియోగ సంఘాల ప్రతినిధులు నీటి భద్రత నీటి వనరుల సంరక్షణ బాధ్యత కలిగి ఉండాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో రాపాక చెరువు వద్ద పరిశుద్ధ కార్యక్రమాన్ని చేపట్టారు. చెరువు పరిశ్రమల ఉన్న తుడు ఇతర కంచెను తొలగించి పరిసర రైతు సోదరులతో, ప్రజలతో కూటమి నాయకులతో కార్యకర్తలతో మమేకమయ్యారు.

## కలికిరిలో బడి పిలుస్తోంది కార్యక్రమానికి మంచి స్పందన



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (కలికిరి)ఏప్రిల్ 18: సిటిజన్ టైమ్స్**

బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కలికిరి మండలంలోని ఇందిరమ్మ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రవేశాల పెంపు లక్ష్యంగా అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ నాయకత్వంలో నిర్వహించారు. ర్యాలీ ఇందిరమ్మ కాలనీ మరియు బీడీ కాలనీలలో నిర్వహించబడింది. ఈ ర్యాలీని పీలేరు మండల విద్యాశాఖ అధికారి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలికిరి మండల విద్యాశాఖ అధికారి సురేష్ మాట్లాడుతూ, ప్రతి పిల్లవాడికి విద్య హక్కు మాత్రమే కాకుండా వారి భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ బోధన వంటి సదుపాయాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.అలాగే చిన్న వయస్సులోనే పిల్లలను పాఠశాలలో చేర్పించడం ద్వారా వారి మానసిక, సామాజిక, విద్యా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పిల్లలను పనుల్లో నిమగ్నం చేయకుండా, తప్పనిసరిగా బడికి పంపాలని, ప్రతి తల్లిదండ్రి తమ బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, వాటి ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా నాణ్యమైన విద్యను అందుకోవచ్చని పేర్కొన్నారు.అలాగే పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని "మన బడిలో సౌకర్యాలు" వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండల విద్యాశాఖ అధికారి-2 నాగార్జున, సి.ఆర్.పీ రియాజ్, పాఠశాల బోధనా సిబ్బంది మధుసూదన్ రెడ్డి, గంగరాజు, సుజాత, షబానా, ఖాదరవల్లి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం..

### జలవనరుల సంరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి...

### ఆలమూరులో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు..




**ఆలమూరు సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

పర్యావరణాన్ని పరిరక్షించాలంటే జలవనరులను కాపాడుకోవాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ తో కల్సి ఆలమూరులో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికంగా చెరువు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. చెత్త ఇస్తే సరుకులు ఇచ్చే స్వచ్ఛ రథాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు.పరిసరాల పరిశుభ్రత, జలవనరుల సంరక్షణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా జలధార పేరుతో నీటి భద్రత-- సాగునీటి సంఘాల బాధ్యత అంటూ ప్రభుత్వం జలవనరుల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అంశంలో భాగస్వాములు కావాలన్నారు. వేసవి సందర్భంగా ఐసీడీఎస్ రూపొందించిన వడదెబ్బ పై అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు..ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

కోనసీమ జిల్లాలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా చేపట్టిన బడి పిలుస్తోంది నమోదు కార్యక్రమాన్ని అధికారులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సమన్వయంతో విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో పాఠశాల విద్యాశాఖ,సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూపొందించిన బడి పిలుస్తోంది ప్రచార గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు.? ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ?నాణ్యమైన విద్యకు చిరునామాగా ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ సంస్థలకు దీటుగా అభివృద్ధి చెందాయన్నారు. 1నుండి 10వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు, అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధనా మాధ్య మాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.? డిజిటల్ విప్లవం పేరిట ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్యానెల్స్, వర్చువల్ క్లాస్ రూమ్‌లు మరియు ఇంటర్నెట్ సౌకర్యంతో డిజిటల్ బోధన సాగుతోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.? పునాది స్థాయి నుండే పటిష్టత చేకూర్చి ప్రీ-ప్రైమరీ స్థాయి నుండి పిల్లలకు ఆనందదాయక అభ్యాసం కోసం జాదుయి పితారా కిట్లను అందజేస్తున్నామని, ప్రాథమిక విద్య ముగిసేలోపు ప్రతి విద్యార్థి కనీస అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు ద్వారా విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపు స్తకాలు,నోట్ బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని, ఇన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించాలన్నారు.? ఉపాధ్యా యుల లభ్యత పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి 100% ఉపాధ్యాయుల లభ్యత ఉండేలా చర్యలు



తీసుకుంటున్నామని, ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ వివరించారు. కేవలం చదువే కాకుండా ఆట స్థలాలు, యోగా,శారీరక విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపడం పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటం వల్ల పునాది స్థాయిలోనే విద్యార్థులకు మంచి పట్టు లభిస్తుందన్నారు.నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు,యూనిఫాంలు,పేద మధ్యతరగతి కుటుంబాలకు గొప్ప ఊరట అన్నారు. జిల్లాలోని పిల్లలందరినీ బడిలో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు ప్రాథమిక స్థాయిలోనే అక్షరాస్యతను పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.13 అంశాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచుతాయన్నారు.ఈ సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో, గ్రామాలలోని రచ్చబండల వద్ద ప్రచారం చేయడం ద్వారా మరింత మంది విద్యార్థులు నమోదు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రజాప్రతిని ధులు, విద్యా కమిటీలు,




స్వచ్ఛంద సంస్థలు ఇంటింటికి వెళ్లి బడి బయట ఉన్న పిల్లల ను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వ రరావు సమగ్ర శిక్ష ఏ.పీ.సి.జి. మమ్మీ,బి.వి.వి.సుబ్రహ్మణ్యం,రమేష్ బాబు, రాంబాబు, సత్యనా రాయణ,రమాదేవి ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తమిళనాడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అబ్జర్వర్ ఒంటెద్దు బాబి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

అమలాపురం పట్టణానికి చెందిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఒంటెద్దు బాబి తమిళనాడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేకేసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ కైపు కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పొన్నేరి డి.ఎం.కె. కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థి తులై చంద్రశేఖర్ ని కలసి సత్కరించి ఎన్నికల ప్రచారంలో తమిళనాడు కో అబ్జర్యర్ వంటెద్దు బాబి పాల్గొన్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## పెండింగ్ కేసులపై వేగం పెంచండి ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాలు





**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :18**

జిల్లాలో నేర నియంత్రణను మరింత బలోపేతం చేయడానికి రాత్రి వేళల్లో డైనమిక్ బీట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నాన్-బెయిలబుల్ వారెంట్స్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, చాలా కాలంగా అమలు కాని వారెంట్లను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను గుర్తించి, ట్రేస్ చేసి కోర్టులో హాజరు పరచాలని తెలిపారు. రాత్రి బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో బీట్‌ల సంఖ్యను పెంచి, తరచుగా నేరాలు జరిగే ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించాలని సూచించారు. నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ మిస్సింగ్ కేసులను వేగంగా ఛేదించాలని, సీసీటీవీ కెమెరాలు మరియు డేటా విశ్లేషణ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసిన వాహనాలను కోర్టు ఆదేశాల మేరకు చట్టబద్ధంగా డిస్పోజ్ చేయాలని, స్టేషన్లలో అనవసరంగా నిల్వ ఉంచకూడదని స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదులను సమయానికి పరిష్కరించాలని, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు హెల్మెట్ వినియోగం, డ్రంకెన్ డ్రైవింగ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా సాంకేతిక అప్లికేషన్ల వినియోగాన్ని పెంచి, కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలని, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో సమాచార నమోదు విధానాన్ని మెరుగుపరచాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు సైబర్ నేరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామ స్థాయిలో విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి ప్రజలతో మమేకం కావాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, భవాని, ఎస్బీ, టాస్క్ ఫోర్స్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్లు ఇమ్మాన్యుయేల్ రాజు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ధర్మాజీగూడెంలో బడి పిలుస్తుంది

**లింగపాలెం ( సిటిజెన్ టైమ్స్ ) ఏప్రియల్ : 18**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెండా ఊపి ఎమ్మెల్యే ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని గ్రామంలో విద్యార్థులు , పాఠశాల సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని ఎమ్మెల్యే సూచించారు.




## 25న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18:**

ఏప్రిల్ 25న జరగనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమా ర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాలీ సెట్ 20 26 నిర్వహణ గూర్చి అధికారులతో సమీక్షిం చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 5 687 అభ్యర్థులకు గాను 15 పరీక్షా కేంద్రాలుఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగు తుందని, పరీక్ష కేంద్రాల - పరిసరాల్లో వివిధ సెక్షన్ల కింద బందో బస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ వారు నిర్వహించే ఈ ఆన్లైన్ పరీక్షకు సంబంధించి శనివారం (ఈనెల 18) నుండి ఆన్లైన్లో హాల్ టికెట్ల విడుదల చేస్తున్నారన్నారు. జిల్లా లోని ప్రభుత్వ, ఎయిడెడ్ మరియు ప్రైవేట్ పాలిటె క్నిక్ కళాశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను ఇంజనీరింగ్, నాన్- ఇంజ నీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలీసెట్- 2026 ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధమైందన్నారు .హాల్ టిక్కెట్లు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయనీ.అభ్యర్థులు తమ పదవ తరగతి హాల్ టికెట్ నంబర్ లేదా రిజిస్టర్డ్ మొబైల్ నంబర్,పుట్టిన తేదీని నమోదు చేసి అధికారిక వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. పరీక్షా విధానం గూర్చి వివరిస్తూ పరీక్ష ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉంటుందన్నారు. మొత్తం 120 బహుళైచ్ఛిక ప్రశ్నలు లెక్కలు -50, భౌతిక శాస్త్రం-40, రసాయన శాస్త్రం-30 ఉంటాయన్నారు దీనిలో నెగిటివ్ మార్కింగ్ విధానం లేదని స్పష్టం చేశా రు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి కనీసం ఒక గంట ముందుగా ఉదయం 10:00 గంటలకు చేరుకోవాలి. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఒరిజి నల్ ఫోటో గుర్తింపు కార్డు ఆధార్, స్కూల్ ఐడి మొదలైనవి వెంట ఉంచు కోవాలన్నారు. డిఆర్ఓ నోడల్ అధికారిగాను జిల్లా ఎస్పీ బందోబస్తు ఏర్పాట్లు ఆర్డీవో అమలాపురం, రామచం ద్రపురం వారు బి.ఎన్.ఎస్ ఎస్ 163 సెక్షన్ 144 సెక్షన్ల పరీక్ష కేంద్రాల వద్ద విధించాలన్నారు డిపిఓ శానిటేషన్ త్రాగునీరు ఏర్పాట్లు పరివేక్షించాలన్నారు ట్రాన్స్కో వారు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆర్టీసీ వారు ఆయా కేంద్రాల రూట్లు లో సమయా నికి బస్సులు నడపాలని ఆదేశించారు. అమలాపురం పట్టణానికి సంబంధించి పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలలోని తడి పొడి చెత్త లను స్థానిక డంపింగ్ యార్డ్ నందు ప్రారంభించనున్న ప్లాస్మా టెక్నాలజీ కేంద్రానికి తరలించేందుకు పంచాయతీ కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శులు ఈ ఓ ఆర్ డి లు ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి చెత్త తరలింపు ప్రక్రియపై తగు చర్యలు తీసు కునే విధంగా జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థాని కంగా ప్రారంభించే ప్లాస్మా టెక్నాలజీ విధానం వల్ల చుట్టు పక్కల గ్రామాలకు డంపింగ్ సమస్యలు ఇకపై పెద్దగా ఉండవని ఎప్పటికప్పుడు తరలించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి బుజ్జి రాజు ఎంపీడీవో బాబ్జి రావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసిన బిజెపి నేత అరవింద్





**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వీసీ సజ్జనార్ ను అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి కి చెందిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గనిశెట్టి అరవింద్ హైదరాబాద్ లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ సజ్జనార్ అరవింద్ కు 'లీడర్స్ ట్రిప్పింగ్ పాయింట్స్' పుస్తకాన్ని బహుకరించారు.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎఎంసి చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్

**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 18**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర సంకల్పంలో భాగంగా, పరిశుభ్రతతో పాటు జలవనరుల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తెలిపారు.శనివారం స్థానిక రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నీటి సంరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేలా, జలవనరులను కాపాడేలా ఈ కార్యక్రమం సమాజానికి ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసికట్టుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి ప్రతి నీటి బొట్టును ఆదా చేస్తూ, జలవనరులను కాలుష్యం నుండి కాపాడాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు, సురక్షితమైన జలవనరులు రేపటి తరానికి నిజమైన ఆస్తి అని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కట్టుబడి ఉండాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర- 2047 దార్శనికతలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జలధార -- జలహారతి థీమ్‌తో నీటి సంరక్షణపై దృష్టి సారిస్తూ వర్షపు నీటిని నిల్వ చేసి అవసరాలకు




వినియోగించుకోవాలని సూచించారు. నీటి కాలుష్యం కారణంగా క్యాన్సర్, కిడ్నీ, లివర్ వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొంటూ వాటి నివారణకు చర్యలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మలచి సాగునీటి సంఘాలు, స్థానికులు, అధికారులు సమిష్టిగా పాల్గొని జలవనరుల సంరక్షణ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా భూగర్భ జల స్థాయిల పెంపు, చెరువులు, కాలువలు, జలాశయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు మాట్లాడుతూ జల సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని, డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. జలధార -- జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ శ్రీకాంత్, హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం లిడియా,పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, గరికపాటి సూర్యనారాయణ, కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, దిగుమర్తి వీరబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి, బల్ల లక్ష్మి,కూటమి పార్టీ నాయకులు, అధికారులు, హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి: ఎమ్మెల్యే పల్లా

**అమరావతి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 18**

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వైద్యుల సలహా మేరకు చికిత్స పొందిన నేపథ్యంలో త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సేవ పట్ల అంకితభావంతో రాష్ట్ర అభివృద్ధి-- ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ వైద్యుల సూచనలను కచ్చితంగా పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి వచ్చి తన బాధ్యతలను యథావిధిగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆయన మరింత ఉత్సాహంతో సేవలందించాలని, ఆయనకు దేవుని ఆశీస్సులు లభించి త్వరగా కోలుకుని ప్రజలకు అందుబాటులోకి రావాలని పల్లా శ్రీనివాసరావు కోరారు.



# నిజంగా రాముడే దిగొచ్చాడా అనుకున్నా!





బాలీవుడ్ లో అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం -రామాయణ్-. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న పౌరాణిక గాథపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా సినిమాలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్ నటిస్తుండటంతో? ఆయన పాత్ర ఎలా ఉండబోతుందా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సెట్‌లో రణబీర్‌ను రాముడి గెటప్‌లో చూసిన నటి సురభి దాస్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సురభి దాస్ షూటింగ్ సెట్‌లో రణబీర్ కపూర్‌ను చూసిన మొదటి క్షణాన్ని గుర్తు చేసుకున్నారు. రణబీర్ రాముడి గెటప్‌లో నడుచుకుంటూ వస్తుంటే? ఒక్క క్షణం తాను తన కళ్ళను తానే నమ్మలేకపోయానని వెల్లడించారు. -నిజంగా ఆ శ్రీరాముడే సాక్షాత్తు భూమి మీదకు దిగి వచ్చాడా? అన్నంత గొప్పగా రణబీర్ ఆహార్యం ఉందని మనసులో అనుకున్నాను. ఆయన కళ్ళలో ప్రశాంతత, గంభీరమైన రూపం చూసి తాను మంత్రముగ్ధురాలినయ్యానని పేర్కొన్నారు. రణబీర్ కపూర్ ఈ పాత్ర కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. కేవలం బాహ్యరూపం మాత్రమే కాకుండా? శ్రీరాముడి వ్యక్తిత్వాన్ని ఆకళింపు చేసుకోవడానికి మాంసాహారాన్ని మానేసి, మద్యానికి దూరంగా ఉంటూ కఠినమైన నియమాలు పాటిస్తున్నారు. ఈ క్రమశిక్షణే ఆయన ముఖంలో ప్రత్యేకమైన తేజస్సును తీసుకువచ్చిందని, అది సెట్‌లోని అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని సురభి వ్యాఖ్యానించారు. నటుడిగా రణబీర్ తనను తాను మలుచుకున్న తీరు అద్భుతమని ఆమె కొనియాడారు. దర్శకుడు నితేష్ తివారీ ఈ చిత్రంలోని ప్రతి పాత్రను, ప్రతి సన్నివేశాన్ని అత్యంత సహజంగా, భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ , సెట్స్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రామాయణ్ రూపొందుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో లీక్ అయిన కొన్ని ఫోటోలు రణబీర్ లుక్‌పై పాజిటివ్ వైబ్స్‌ను క్రియేట్ చేయగా తాజాగా సురభి దాస్ చెప్పిన విషయాలు అభిమానుల్లో ఉత్కంఠను మరింత పెంచాయి. శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తోన్న ఈ సినిమా భారతీయ సినీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఒక నటుడు తన పాత్రలో ఎంతగా లీనమైతే? సెట్‌లోని తోటి నటీనటులు కూడా అంతటి ఆశ్చర్యానికి లోనవుతారో చెప్పడానికి సురభి దాస్ మాటలే నిదర్శనం. అలాగే సినిమాలో రణబీర్ కపూర్ - సాయి పల్లవిల మధ్య కెమిస్ట్రీ కూడా అద్భుతంగా పండనుందని సురభి దాస్ హింట్ ఇచ్చారు. వీరిద్దరూ ఆయా పాత్రల కోసం ప్రాణం పెట్టి నటిస్తున్నారని, సెట్‌లో వారి మధ్య జరిగే సంభాషణలు మరియు భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఒక సరికొత్త లోకానికి తీసుకెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కి అద్భుతమైన రికార్డు.. 8 ఏళ్లలో ఒక్కసారి కూడా గెలవని చెన్నై సూపర్ కింగ్స్









ఐపీఎల్ 2026లో భాగంగా (2026, ఏప్రిల్ 18న) సన్‌రైజర్స్ హైదరా బాద్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య రసవత్తర పోరు జరిగే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఇరు జట్లు ఒకే పొజిషన్‌లో ఉండటంతో ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు టాప్--5లోకి రానుంది. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో సీఎస్కేకి నిజమైన అగ్ని పరీక్షే అని చెప్పాలి.. ఎందుకంటే ఉప్పల్‌లో చెన్నైపై సన్‌రైజర్స్‌కి ఉన్న రికార్డు అలాంటిది మరీ. ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్స్‌గా నిలిచిన సీఎస్కే, ఉప్పల్‌లో మాత్రం జీరోనే అని చెప్పాలి.. గత 8 ఏళ్లలో ఈ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలే.. ఈ వేదికపై ఆడిన అన్ని మ్యాచ్‌లలోనూ సన్‌రైజర్స్ హైదరాబాదే గెలిచింది. దాంతో హైదరాబాద్ జట్టు ఈ మ్యాచ్‌లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

**హెడ్ టు హెడ్ రికార్డులు:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మొత్తం 22 మ్యాచ్‌లు జరిగగా, అందులో సీఎస్కే 15 మ్యాచ్‌లలో విజయం సాధించగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ కేవలం 7 మ్యాచ్‌లలో విక్టరీ సాధించింది. గతేడాది ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక మ్యాచ్‌లో కూడా ఎస్‌ఆర్‌హెచే గెలిచింది. ఇక చివరగా జరిగిన ఐదు మ్యాచ్‌లలో కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ 3--2తో అధిపత్యం ప్రదర్శించింది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 5 మ్యాచ్‌లలో 2 గెలిచి, మూడింట్లో ఓడిపోయింది. రాజస్థాన్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీ గ్రాండ్ విక్టరీ సాధించింది. ఇక చెన్నై సూపర్ కింగ్స్ కూడా మూడు మ్యాచుల్లో ఓడి, రెండింట్లో గెలిచింది. చివరగా ఆడిన రెండు మ్యాచ్‌లలో గెలిచి చెన్నై మంచి జోష్‌లో కనిపిస్తుంది. దాంతో ఈ మ్యాచ్ రసవత్తరంగా సాగే ఛాన్స్ ఉంది.

**తుది జట్ల అంచనా:**

సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (కెప్టెన్ & కీపర్), హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగే, ఈషన్ మలింగ.

ఇంపాక్ట్ ప్లేయర్స్: లియామ్ లివింగ్‌స్టోన్, హర్షల్ పటేల్

**చెన్నై సూపర్ కింగ్స్:**

సంజూ శాంసన్ (కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మ్హాత్రే, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, డెవాల్డ్ బ్రెవిస్, జేమీ ఓవర్టన్, నూర్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, గుర్జప్నీత్ సింగ్, ఖలీల్ అహ్మద్.

ఇంపాక్ట్ ప్లేయర్స్: మాథ్యూ షార్ట్, మాట్ హెన్రీ

## సాల్ట్ మరోసారి దూకుడుగా ఆడినా... భారీ స్కోరు సాధించలేకపోయిన ఆర్సీబీ

- దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ చేసిన ఫిలిప్ సాల్ట్
- ఆర్సీబీ స్కోరు 175/8
- కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్
- మధ్య ఓవర్లలో వికెట్లు కోల్పోయి తడబడిన బెంగళూరు
- విఫలమైన ఆర్సీబీ మిడిల్ ఆర్డర్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (38 బంతుల్లో 63) మరోసారి దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీతో రాణించినప్పటికీ, మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం లభించలేదు. దీంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది.బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ (19), ఫిలిప్ సాల్ట్ మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, కోహ్లీ ఔటైన తర్వాత ఆర్సీబీ ఇన్నింగ్స్ నెమ్మదించింది. సాల్ట్ తన దూకుడు కొనసాగించినా, మరో ఎండ్‌లో వికెట్లు పడుతూనే ఉన్నాయి.ముఖ్యంగా ఢిల్లీ స్పిన్నర్లు అక్షర్ పటేల్ (2/18), కుల్దీప్ యాదవ్ (2/32) అద్భుతంగా బౌలింగ్ చేసి ఆర్సీబీ పరుగుల వేగానికి కళ్లెం వేశారు. కీలకమైన సాల్ట్ వికెట్‌ను కుల్దీప్ తీయగా, అక్షర్ తన పొదుపైన బౌలింగ్‌తో ఒత్తిడి పెంచాడు. పడిక్కల్ (18), టిమ్ డేవిడ్ (26) కాసేపు మెరిసినా పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయారు. జితేశ్ శర్మ (20 బంతుల్లో 14) చాలా నెమ్మదిగా ఆడటం కూడా స్కోరుపై ప్రభావం చూపింది. చివరి ఓవర్లలోనూ వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి కూడా రెండు వికెట్లు పడగొట్టాడు.

## టాస్ ఢిల్లీదే... 100 మ్యాచ్‌లతో ఆర్సీబీ అరుదైన రికార్డు




ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) తలపడుతున్నాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఆర్సీబీ తొలుత బ్యాటింగ్‌కు దిగనుంది. ఈ స్టేడియంలో ఆర్సీబీకి ఇది 100వ ఐపీఎల్ మ్యాచ్ కావడం విశేషం. ఐపీఎల్ చరిత్రలో ఒకే వేదికపై 100 మ్యాచ్‌లు ఆడిన తొలి జట్టుగా ఆర్సీబీ రికార్డు సృష్టించింది. టాస్ గెలిచిన అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ, "పిచ్ బాగుంది. ఇది డే గేమ్ కావడంతో కాస్త నెమ్మదిగా ఉండొచ్చు. చిన్నస్వామి సాధారణంగా ఛేజింగ్ గ్రౌండ్, అందుకే మేము బౌలింగ్ ఎంచుకున్నాం" అని తెలిపాడు. వరుస ఓటముల తర్వాత వచ్చిన విరామం జట్టు తిరిగి పుంజుకోవడానికి సహాయపడిందని అన్నాడు. ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ మాట్లాడుతూ, "మేము కూడా మొదట బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం. ఇది మంచి పిచ్, మంచి స్కోరు చేసి వారిపై ఒత్తిడి పెంచుతాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ఈ ఏడాది ఫైనల్ చిన్నస్వామిలోనే జరగనున్నందున, సొంతగడ్డపై అన్ని మ్యాచ్‌లు గెలవడం ముఖ్యమని చెప్పాడు. ఇరు జట్లు తమ తుది జట్లలో ఎలాంటి మార్పులు చేయకుండానే బరిలోకి దిగుతున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, సుయాశ్ శర్మ, జోష్ హేజిల్‌వుడ్. ఢిల్లీ క్యాపిటల్స్: పతుమ్ నిస్సంక, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సమీర్ రిజ్వీ, అక్షర్ పటేల్ (కెప్టెన్), డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, అకిబ్ నబీ దార్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, టి. నటరాజన్, ముఖేష్ కుమార్.

**ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: రసిఖ్ సలామ్ దార్, వెంకటేష్ అయ్యర్, జోర్డాన్ కాక్స్, మంగేష్ యాదవ్, విక్కీ ఓస్త్వాల్.

ఢిల్లీ క్యాపిటల్స్: విప్రజ్ నిగమ్, అశుతోష్ శర్మ, కరుణ్ నాయర్, దుష్మంత చమీర, నితీశ్ రాణా.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776